# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నేడు శివయ్యకు

# శాంతి అభిషేకాలు

### గ్రహణకాలంలో అభిషేకాలు



శ్రీకాళహస్తి, మార్చి 2 ప్రభాతవార్త

సూర్య, చంద్ర గ్రహణ కాలంలో దేశంలోని ఆలయాలను మూసి వేసి గ్రహణం వీడిన తరువాత శుద్ధి చేసి తరువాత పూజలు, దర్శనాలకు అనుమతించటం ఆనవాయితి. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాడు. ఈ దివ్యక్షేత్రంలో గ్రహణాల సందర్భంగా శాంతి అభిషేకాలు నిర్వహించే ఆనవాయితి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మూలవిరట్టుకు శాంతి అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి మంగళవారం మధ్యాహ్నం గ్రహణ కాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ససోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజాది కార్యక్రమాలు భిన్నంగా ఉంటాయన్నారు. మార్చిన పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా స్వామి వారికి శాంతి అబిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ అభిషేకాలకు సంబంధించి వేదపండితులు అర్చకులు ఇలా తెలియజేసారు. సాధారణంగా గ్రహణం అంటే ఇబ్బంది అని అర్థం అని కాబట్టి ఆ సమయంలో నివృత్తి చేయాల్సి ఉందన్నారు. ఆ సమయంలో శాంతి అభిషేకాలు నిర్వహించాలని స్థానిక ఆచారంగా వివరించారు. మార్చి 3న గ్రహణం కేతు గ్రస్త గ్రహణంగా వివరించారు. రాహుకేతువులతో పాటు తొమ్మిది రాసులు, 27 నక్షత్రాలు వాయులింగేశ్వరునిలో మిళితం చేసుకున్నారని కాబట్టి గ్రహణ మధ్యకాలంలో స్వామి అమ్మవార్లకు శాంతి అభిషేకాలు నిర్వహించుటకు వేదపండితులు అర్చకులు సూచించినట్లు ఇఓ వివరించారు. గ్రహణ స్పర్శ కాలం మధ్యాహ్నం 3.20గంటలకని, గ్రహణ మధ్యకాలం సాయంత్రం 5.03గంటలకని, మోక్షకాలం సాయంత్రం 5.47గంటలని వివరించారు. గ్రహణం మధ్యకాలం సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు జరిపి శాంతింపజేస్తామన్నారు

## రెండు టపాసులు గోడౌన్లు సీజ్...

రేణిగుంట మార్చి 2 ప్రభాతవార్త



రేణిగుంట మండలంలోని రెండు టపాసుల దుకాణాలు ఒక గోడౌన్ ను అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. మండలంలోని గురవరాజు పల్లి క్రాకర్స్ మార్ట్సు అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, రేణిగుంట తాహ సిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఇస్తా ధర్మారెడ్డి, ఆర్ ఎస్ డి టి దిలీప్, స్థానిక విఆర్ఓ శంకర్ తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తూకివాకం పంచాయతీలోని టపాసుల గోడౌన్లను షాపులను తనిఖీ చేసి రెండు షాపులు ఒక గోడౌన్ను సీజ్ చేశారు.

# స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే!

### బిసీ జన గణన అనంతరం పంచాయతీ, ఎంపిటిసీ, జడ్పీటిసీ ఎన్నికలు - ఆశావాహుల ఆశలు ఆవిరి

చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త:

స్థానిక సంస్థలకు ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని తెలుస్తోంది, రాష్ట్ర హైకోర్టులో స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యంపై జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ రాష్ట్రంలో బిసీ జన గణన పూర్తయిన అనంతరం మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు, జడ్పిటీసీ, ఎంపిటీసీల ఎన్నికలు నిర్వహించే అవకాశం వుందని చెప్పడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం స్పష్టమైంది. అయితే న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంపై మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వ ఉద్దేశం ఏమిటనేది మూడు వారాల అనంతరం స్పష్టం కానుంది. రాష్ట్రంలో మున్సిపల్ పాలకవర్గాలకు మార్చి 17వ తేదీ, గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఏప్రిల్ 2వ తేదీ గడువు ముగియనున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వుండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవచ్చునని అధికార పార్టీకి చెందిన గ్రామ, పట్టణ స్థాయి నాయకులు మున్సిపల్, పంచాయతీ ఎన్నికలపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పట్లో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు కన్పింకపోవడంతో గ్రామ, పట్టణ స్థాయి నాయకులు ఇప్పటి వరకు ఎన్నికలపై పెట్టుకున్న ఆశలు ఆవిరి అయ్యాయి. 2021 సంవత్సరంలో రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల్లో అధికారంను అడ్డం పెట్టుకుని అప్పటి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీగా గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలను చేజిక్కించుకుని పూర్తి స్థాయిలో స్థానిక సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో వుండటంతో స్థానిక సంస్థలను తమ పార్టీ నేతల గుప్పిట్లో పెట్టుకోవడానికి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను సకాలంలో నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు ఇప్పటి వరకు ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు కాదని హైకోర్టులో అడ్వకేట్ జనరల్‌తో చెప్పించడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న అధికార పార్టీకి చెందిన గ్రామ, పట్టణ స్థాయి నాయకులకు షాక్ తగిలినట్లు అయ్యింది. మరోవైపు జిల్లా పరిషత్ ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌గా కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటికీ జిల్లా పరిషత్‌ల విభజన జరుగలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ముందుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌ను విభజించి కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు నూతనంగా జిల్లా పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ఈ ప్రక్రియ సైతం కొంత ఆలస్యంగా జరిగే అవకాశం వుండటంతో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది.

# ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై మాక్‌డ్రిల్



### -అప్రమత్తతతో వ్యవహరించాలి
### -భద్రత విభాగాలతో జిల్లా ఉన్నతాధికారులు

తిరుపతి, మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:

జిల్లాలో భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) ఆధ్వర్యంలో యాంటీ టెర్రరిస్ట్ మాక్ ఎక్సర్సైజ్ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగింది. మూడురోజులు జరిగే ఈ మాక్‌డ్రిల్‌లో తిరుమల ,తిరుపతి లో ఎన్.ఎస్.జి. బృందం ద్వారా యాంటీ టెర్రరిస్ట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ లో పాల్గొంటున్న ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఆక్టోపస్ దళాలు, ఎన్ ఎస్ జి బృందాల సమన్వయం తో యాంటీ టెర్రరిస్ట్ మాక్ డ్రిల్ నిర్వహించి, అత్యవసర పరిస్థితులను వాస్తవంగా భావించి ప్రతి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితికి సంబంధించి పోలీస్ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ కు ప్రాథమికంగా సమాచారం అందించడం జరుగుతుందని, అనంతరం భద్రతా చర్యల్లో పాల్గొనే శాఖలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ తో పాటు ఆక్టోపస్ భద్రతా దళాలు పాల్గొననున్నాయన్నారు. ఎన్.ఎస్.జి. కమాండో ఆపరేషన్ చేపట్టడం జరుగుతుందన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు తిరుమలలో పద్మావతి అతిదిగృహం వద్ద టిటిడి ఆలయ నియమ నిబంధనలకు అనుగుణంగా మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. టిటిడి విజిలెన్స్ వింగ్, ఎన్.ఎస్.జి. బృందం సమన్వయంతో కమాండో ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని, సిసి కెమెరాలు, అవకాశం ఉన్న చోట డ్రోన్ లను ఉపయోగించడం జరుగుతుందన్నారు. టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ దేవస్థానాల భద్రత అత్యంత ప్రాధాన్యమైనదని, ఎన్.ఎస్.జీ. సూచనల మేరకు సీసీటీవీ నిఘా, యాక్సెస్ కంట్రోల్, సిబ్బంది శిక్షణ వంటి అంశాలను బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ యాంటీ టెర్రరిస్ట్ ఎక్సర్సైజ్ మాక్ డ్రిల్ ద్వారా భద్రతా వ్యవస్థల సామర్థ్యాన్ని పరీక్షించి, లోపాలను గుర్తించి, సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం భద్రతా సాధన కార్యక్రమమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఎన్.ఎస్.జి. మేజర్ అధికారులు, రీజనల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ వెంకటరాముడు, డిటిసి మురళి మోహన్, ఆర్ టి సి అధికారి విశ్వనాథ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, టీటీడీ, రెవెన్యూ, ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులు, ఆక్టోపస్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా అధికారులు

# వైభవంగా పుష్పయాగ మహోత్సవం



పులిచెర్ల, మార్చి 2, ప్రభాతవార్త

పులిచెర్ల మండలంలోని మంగళంపేటలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో చివరి రోజు సోమవారం స్వామివారికి పుష్పయాగ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి ఆచార్యులు పుష్ప యాగ మహోత్సవం రమణీయంగా వేదమంత్రాలతో భక్తుల గోవింద నామ స్మరణల నడుమ నిర్వహించారు. పుష్పయాగ మహోత్సవం చూసే కన్నులకు కలిగే మహాభాగ్యంలా ఎంతో ఆకర్షణీయంగా భక్తి భావం వెల్లి విరిసింది. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఉభయధారులుగా మంగళంపేటకు చెందిన కుంచే లక్ష్మిపతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ బ్రహ్మోత్సవాలు ఎంతో భక్తి భావంతో ఆధ్యాత్మిక వాతావరణంలో ఉభయదారుల సహకారంతో, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల సమగ్ర ప్రణాళిక, ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి ఆచార్యులు పూజా కార్యక్రమాల నిర్వహించారు. వాహన సేవలో, భజనలు కోలాటాలు. చెక్క భజనలు ఒకటేమిటి బ్రహ్మోత్సవాలు జరిగిన అన్ని రోజులు మంగళంపేట భక్తి శోభతో విరజిల్లుంది.

# సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



ధప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలను నిర్ధేశించిన గడువులోపు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, డిఆర్ఓ మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడెల్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్, అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణి తదితరులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 62 సమస్యలు

# ఏప్రిల్ 19 నుంచి పరశురామేశ్వర ఆలయ కుంభాభిషేకం

### పురావస్తుశాఖ డైరెక్టర్ సమీక్ష





ఏర్పేడు, మార్చి 2 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలో వెలసిన అతిపురాతన శివాలయం ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయం జీర్ణోద్ధారణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను పురావస్థు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి స్థానిక ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి, గ్రామస్తులతో సమీక్షించారు. ఇక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఏప్రిల్ 19 నుంచి 23 వరకు జరిగే కుంబాభిషేకంను భారీ ఎత్తున నిర్వహించుటకు గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసారు. డైరెక్టర్ మునిరత్నం రెడ్డి రాగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు చైర్మెన్ గిరి నాయుడు, ఇఓ, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు మాట్లాడుతూ పురావస్తుశాఖ పర్యవేక్షణ లో ఉన్న ఆలయానికి నేడు భక్తుల సంఖ్యవిపరీతంగా పెరిగిందని అందుకు తగ్గట్లు తమ పరిధిలో తాము అభివృద్దికి నిధులు కేటాయిస్తున్నామని దాతల సహకారంతో ఇక్కడ బస సదుపాయాలకు నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు, హుండీల ఆదాయం పెరిగిందని వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఇటీవల గ్రామంలో సిమెంటు రోడ్లు వేయటానికి గ్రామస్థులు దగ్గరుండి వెడల్పాటి రోడ్డును నిర్మించామన్నారు. డైరెక్టర్ మునిరత్నం రెడ్డి ధర్మకర్తల మండలి చైర్మెన్ చొరవను, ఇఓ సహకారాన్ని అభినందించారు. సమావేశంలో డైరెక్టర్ మునిరత్నంతో పాటు చైర్మెన్ బత్తల గిరి నాయుడు, గ్రామానికి చెందిన పెద్దలు రాజశేఖర్‌నాయుడు హేమసుందరం, పద్మనాభనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురై వ్యక్తి మృతి

పుత్తూరు రూరల్, మార్చి 2 ప్రభాతవార్త:

వడదెబ్బకు గురై వ్యక్తి ఆర్టీసీ బస్సులో మృతి చెందిన సంఘటన సోమవారం పుత్తూరు ఆర్టీసీ డిపోలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... పుత్తూరు పట్టణం జెండా మాను వీధికి చెందిన పార్దీబన్ అనా రోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్తూరు నుంచి ఆర్టీసీ బస్సులో పుత్తూరు డిపోకు చేరుకున్నారు. బస్సు దిగే సమయంలో అలసటగా ఉందని కూర్చోని అలాగే ఒరిగిపోయారన్నారు. దీంతో 108కి సమాచారం అందించామని, అదే సమయంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారని, దీంతో కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

# పెద్దగంగమ్మ ఆలయ చైర్మన్ బిజెపికే

### -సోము వేదవతి కి అవకాశం



తిరుపతి, మార్చి 2ప్రభాతవార్త:

తిరుపతిలోని తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షురాలుగా తిరుపతికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు సోము వేదవతి రాయల్ నియమితులయ్యారు. ఆమె సోమవారం ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు . బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆమె ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు. తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, తాళ్లపాక గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు టిడిపి వంశీ అంకాల పరమేశ్వరి గుడి పాలక మండల సభ్యులు దస్తగిరి రెడ్డి ,బిజెపి సెంట్రల్ మండల అధ్యక్షుడు దీపక్ యాదవ్ ,బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు ,ముని సుబ్రహ్మణ్యం, కొండేటి ప్రేమ్, శ్రీధర్, నవీన్ రాయల్ ,, రెడ్డి బాబు ,గంగయ్య,,చిత్రపు హనుమంతరావు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త ప్రశ్నాపత్రంతో తికమక



**ప్రశ్నలు ఎక్కువ... సమయం తక్కువ.**
**సాధారణ విద్యార్థి అందుకోలేని స్థాయిలో ప్రశ్నాపత్రం.**
**8, 4మార్కుల ప్రశ్నలు అర్థం కాలేదంటూ విద్యార్థుల ఆవేదన.**

తిరుపతి విద్య, మార్చి 2 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఎస్సీ ఈఆర్టీ స్థాయిలో నూతన సిలబస్ ను ప్రవేశపెట్టింది. కానీ ఆ స్థాయిలో విద్యార్థులను సన్నద్ధం చేయడంలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో భాగంగా నూతన సిలబస్తో సోమవారం జరిగిన ఫస్ట్ ఇయర్ మ్యాథ్స్ పరీక్ష పశ్నపత్రం కఠినితరంగా ఉందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. పాత సిలబస్ ప్రకారం 20 ప్రశ్నల పశ్నాపత్రాన్ని మూడు గంటల సమయంలో రాయాల్సి ఉండేదని, ప్రస్తుత నూతన సిలబస్ ప్రకారం ప్రశ్నాపత్రంలో 34 ప్రశ్నలు సందించారు. దీంతో విద్యార్థులు ప్రశ్నలను చదువుకుని అర్థం చేసుకునేందుకే సమయం సరిపోయిందని వాపోతున్నారు.

**పేపర్ కఠినంగా... తికమకగా ఉంది.**

గతంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విద్యార్థులకు మ్యాథ్స్, మ్యాథ్స్ రెండు పరీక్షలు నిర్వహించే వారు. మ్యాథ్స్ ఫస్ట్ ఇయర్ సిలబస్ రెండు పేపర్లుగా పబ్లిక్ పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులకు పరీక్షా సమయంతో పాటు సిలబస్ ను సైతం పూర్తి స్థాయిలో కవర్ చేసుకుని పరీక్షలకు హాజరై ఉత్తమ మార్కులు సాధించేవారు. కానీ ప్రస్తుత నూతన సిలబస్తో మ్యాథ్స్ పరీక్ష ఒకటే కావడంతో మొత్తం సిలబస్ ను విద్యార్థులు కవర్ చేయాల్సి ఉండటంతో కాస్త ఇబ్బందిపడ్డారు. దీంతో పాటు ఇచ్చిన ప్రశ్నాపత్రంలో 8, 4 మార్కుల ప్రశ్నలు కఠినంగా ఇచ్చారని, సాధారణ విద్యార్థులు అర్థం చేసుకోని జవాబు రాసే పరిస్థితి కనబడలేదని అధ్యాపకులు సైతం ఆశ్చర్యపోతున్నారు.

**బోర్డు మోడల్ పేపర్లతో ఉపయోగం నిల్.**

నూతన సిలబస్ ఆధారంగా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పరీక్షల అవగాహన కోసం అందించిన మోడల్ పేపర్లతో ఉపయోగం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కనీసం ఆ మేరకు 20శాతం ప్రశ్నలు సైతం పబ్లిక్ పరీక్షలో లేకపోవడం దారుణమని చెబుతున్నారు. ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ సైతం నూతన ప్రశ్నా పత్రంలోని ప్రశ్నలకు పూర్తి స్థాయిలో సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇక సాధారణ విద్యార్థుల పరిస్థితి చెప్పలేమని ప్రశ్నా పత్రాన్ని పరిశీలించిన అధ్యాపకులు చెప్పడం విశేషం

**438మంది గైర్హాజరు.**

జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ మ్యాథ్స్ పరీక్షకు 438 మంది గైర్హాజరైనట్లు ఆర్ ఐఓ జి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 21693 మందికి గాను 21255 మంది హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలియజేశారు.

# సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి

### -జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి, మార్చి 2ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్‌లో ప్రజల సమస్య లను సావధానంగా వింటూ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అర్జీలు స్వీకరించారు. సమస్యలపై నిరక్ష్యం వహించరాదని కలెక్టర్ నిర్ధేశించారు. అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. నిరక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా రెవిన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, రోజ్ మాండ్ లు పాల్గొన్నారు. మొత్తం 390 అర్జీలు అందాయి. జిల్లా కలెక్టరేట్‌లో అర్జీదారులకు సకల సౌకర్యాలను కల్పించారు.

## వ్యవసాయ రంగంకు పెద్దపీట

గుడిపాల, మార్చి 2 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంకు పెద్దపీట వేస్తోందని జెజెఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చెన్నకే శవనాయుడు, ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరిలు పేర్కొన్నారు. గుడిపాల గ్రామ సచివాలయంలో సోమ వారం జెజెఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చెన్నకేశవ నాయుడు, ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరిలు ప్రభు త్వం అందిస్తున్న సబ్సిడీ యూరియాను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు యూరి యా కొరత లేకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నారన్నారు. కూటమి ప్రభు త్వానికి రైతు సంక్షేమమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నా యుడు, మహిళా అధికార ప్రతినిధి తుమ్మల లలిత, నాయకులు గోపి, యోగానందం, రైతులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ముగ్గురు పేకాట రాయుళ్ళు అరెస్టు

గుడిపాల, మార్చి 2 ప్రభాతవార్త:



గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని 190 రామాపురం పరిస రాల్లో వున్న ఓ మామిడితోటలో నడుస్తున్న ఓ పేకాట శిబిరంపై పోలీ సులు దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్ళను అరె స్టు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ రామ్మోహన్ మా ట్లాడుతూ పేకాట ఆడుతున్న ఆరు మంది పేకాట అడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేయడం జరిగిందన్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో పేకాట ఆడుతున్న ముగ్గురు అక్కడి నుండి పారిపో యారని, మిగిలిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుండి 4,150 రూపాయలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న చంద్ర, బాలాజీ, గణపతి, శరత్, సతీష్, రామరాజులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పారిపోయిన ముగ్గురిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

## మహిళపై అత్యాచారయత్నం

గంగవరం, మార్చి 2 ప్రభాతవార్త:

ఒంటరి మహిళపై అత్యాచారయత్నంకు పాల్పడిన సంఘటన సోమవారం ఉదయం మండలంలో వెలుగు చూసింది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని మేలుమాయి పంచాయతీ కొత్తూరు గ్రామంకు చెందిన ఓ మహిళ(60) ఆదివారం రాత్రి ఇంట్లో ఒంటరిగా వున్న సమయంలో అదే గ్రామంకు చెందిన కృష్ణప్ప అనే వ్యక్తి పూటుగా మద్యం సేవించి మహిళ ఒంటరిగా వున్న ఇంట్లోకి వెళ్ళి లైంగికంగా వేధించి అత్యాచార యత్నంకు ప్రయత్నించడంతో వెంటనే అప్రమత్తమైన మహిళ కృష్ణప్పను పక్కకు నెట్టివేసి తన ఇంట్లోనే తలుపులు వేసి నిర్బంధించి తమ బంధువుల ఇళ్ళ వద్దకు చేరుకుని విషయంను బంధువులకు తెలిపింది. బంధువుల సహాయంతో మహిళ పోలీసులనుఆశ్రయించడంతోగంగవరంపోలీసులునిందితుడుకృష్ణప్పనుఅదుపులోకితీసుకునివిచారిస్తున్నారు.

## టమోటా కర్రలు దగ్ధం : రూ. 20వేలు నష్టం

చౌడేపల్లి, మార్చి 2 ప్రభాతవార్త



టమోటా కర్రలు దగ్ధమై రూ. 20వేల వరకు నష్టం వాటిల్లిన సంఘటన సోమవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు కథనం మేరకు...మండలంలోని ఆమిని గుంట పంచాయతీ శింగిరిగుంట వద్ద ప్రకాష్‌కు చెందిన పొలంలో టమోటా కోసం కర్రలను తెచ్చి పెట్టుకొ న్నాడు. వాటి నుంచి మంటలు చెలరేగడంతో గుర్తించిన చుట్టుపక్కల వారు ఆర్పే ప్రయత్నం చేసి విఫమయ్యారు. విషయాన్ని తెలుసుకొన్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసారు. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి సిగరెట్టు ముక్కను ఆర్పకుండా పడేయడం వల్లనే ప్రమాదం జరిగినట్లు సుబ్బరాజు తెలిపారు. అదే విధంగా చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి సమీపంలోని పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల మామిడి చెట్లు కాలిబూడిదయ్యాయి.

## కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకం

చౌడేపల్లి, మార్చి 2 ప్రభాతవార్త



చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి అగ్రహారం వద్ద గల శ్రీవిశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం లో సోమవారం రుద్రాభిషేకాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చ కులచే అభిషేక ప్రియునికి రుద్ర, పంచామృతా భిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిసేవలోపాల్గొన్నారు.ఆలయనిర్మాణదాత మనోహర్‌ఆధ్వర్యంలో భక్తులకుపవిత్రతీర్థ ప్రసాదాలందించారు.

# రైల్వే కోడూరు డివిజన్

## ఘనంగా కనక రుద్రమ్మ తిరుణాల

పుల్లంపేట, మార్చి 2 ప్రభాతవార్త :





మండల పరిధిలోని పివిజిపల్లి, రామసముద్రం పంచాయతీల పరిధిలోని దేవరకొండ వద్ద వెలసిన శ్రీకనక రుద్రమ్మ ఆలయంలో సోమవారం వైభవంగా తిరునాళ్లను నిర్వహించారు. ముందుగా శ్రీ కనకదుర్గ అమ్మవారిని కడప జిల్లా రాజంపేట మండలంలోని ఊటుకూరు గ్రామం నుంచి ఆదివారం రాత్రి అమ్మ వారిని ప్రత్యేక అలంకరణ గావించి చాందిని రథంపై ఊరేగింపుగా బయలుదేరి వెంకట రాజంపేట అనంతయ్యగారి పల్లి మీదుగా భారీ జన సందోహం మధ్య పివిజిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి విడిది అనంతరం సోమవారం తెల్లవారుజామున శ్రీకనక రుద్రమ్మ అమ్మవారిని ఆలయంలో ప్రతిష్టించారు. అనంతరం భక్తులు దర్శించుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల వారు భోజన వసతిని ఏర్పాటు చేశారు. పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం వారు దాతల సహకారంతో ఏడేళ్లుగా సుమారు 1700 మందికి అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎస్సై చిన్న రెడ్డప్ప ప్రారంభించి భక్తులకు భోజనాలను వడ్డించారు. సాయంత్రం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం చుట్టూ చాందిని బండ్లు ప్రదక్షిణ భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జకియా ఖానామ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణమ నాయుడు, లింగుట్ల వెంకటరమణ, పుల్లంపేట మండల బిజెపి సంచాలకుడు మనోహర్ రెడ్డి, కంబాల శ్రీనివాసులు పాల్గొన్నారు.పుల్లంపేటఎస్సై చిన్నరెడ్డప్పబందోబస్తునిర్వహించారు.

## విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్‌పై వర్క్ షాపు .

తిరుపతి విద్య, మార్చి 2 ప్రభాతవార్త




స్థానిక బైరాగిపట్టెడలోని రిమ్స్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు స్కిల్ డెవల ప్మెంట్ పై ఏడురోజుల పాటు జరగనున్న ప్రత్యేక వర్క్షాపును సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ జే ప్రకాష్రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావ కాశాలను మెరుగు పరిచేందుకు స్కిలెవలప్మెంట్పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రధానంగా సెలవేర్నెస్, గోల్సెట్టింగ్, టైం మేనేజ్మెంట్, బాడీలాంగ్వేజ్, ప్రొఫెషనల్ గ్రోత్ అండ్ కమ్యూనికేషన్, రెజ్యూమ్ ప్రిపరేషన్, గ్రూప్ డిస్కషన్ వంటి అంశాలలో పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇందుకోసం విజయవాడకు చెందిన నాంది ఫౌండేషన్ సౌత్ జోన్ హెడ్ లక్ష్మీ ్మ, పవన్ శర్మ ట్రైనర్స్ గా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం వై కొండారెడ్డి,ఆనంద్ రెడ్డి , విజయ్ రెడ్డి ,హెచ్ ఓ డి నిరంజన్ రెడ్డి ,మధుర అధ్యాపకులు, విద్యార్థులు

## రాహుల్‌గాంధీని కలిసిన టిక్కి రాయల్




చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధినేత, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని సోమవారం చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్ కలిశారు. హైదారాబాదులో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శిక్షణా శిబిరంకు సోమవారం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిలాతో కలిసి చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కిరాయల్ రాయల్ రాహుల్‌గాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాహుల్‌గాంధీ దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కాంగ్రెస్ శ్రేణులు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 54 ఫిర్యాదులు



చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి 54 సమస్యలపై వినతిపత్రాలు అందా యి. ప్రజల నుండి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ తుషార్ డూడి క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఆపరేషన్స్ ఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ నాయుడులు ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 23 సమస్యలు అందగా, డబ్బు తగాదాలు 6, పోలీసు సర్వీసు 5, వేధింపులు 5, ఆస్తి తగాదాలు 7, చిన్న గొడవలు 4, కుటుంబ తగాదాలు 2, చీటింగ్, సైబర్ క్రైమ్‌లకు సంబంధించి ఒకొక్క ఫిర్యాదు అందింది.

## ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు

- టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య

చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త:



మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయా లని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య పిలుపు నిచ్చారు. టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలా జీ నగర్ కాలనీలో సోమవారం టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య 52 మహిళా సంఘాల సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య మాట్లాడుతూ ప్రతి మహిళ చట్టాలపై అవగాహన పెంచుకుని ఆర్థిక స్వాలంబన దిశగా ప్రయాణం చేయాలన్నారు. మహిళలకు ఎక్కడైన అన్యాయం జరిగితే సత్వరం పోలీసులను సంప్రదించి న్యాయం పొందాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ మోసాలు సర్వసాధారణం అయ్యాయని, వీటిని మహిళలు అప్రమత్తంగా వుండాలన్నారు. అలాగే సోషల్ మీడియా దుర్వినియోగం అవుతోందని, మహిళలు సోషల్ మీడియాకు దూరంగా వుండాలన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఎదైనా సమాచారం వుంటే సత్వరం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శివకుమార్, వెల్ఫేర్ సెక్రటరీ, అడ్మిన్ సెక్రటరీ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలుమహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం చిత్తూరు టుటౌన్ పోలీసులు వరదప్పనాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మహిళల భద్రత అంశంపై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య టెన్త్ విద్యార్థులకు మహిళా భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య మాట్లాడుతూ మహి ళలు సమాజానికి మూల స్తంభాలని, ఒక మహిళ విద్యావంతురాలైతే కుటుంబం, సమాజం, దేశం అభి వృద్ధిచెందుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారం

చిత్తూరుహెల్త్, మార్చి 2 ప్రభాతవార్త:



ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్య ు తీసుకోవలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌తో పాటు మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ నాగేంద్ర, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై మొత్తం 13 వినతులు అందగా అందులో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 3,పెన్షన్లు3,టిడ్కో2,రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 2, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి ఒక సమస్య అందాయి.

## సమాచార హక్కుకు న్యాయం చేయండి

బంగారుపాళ్యం, మార్చి 2 ప్రభాతవార్త:



ప్రభుత్వాలు ప్రజలకు ప్రసాదించిన సమాచార హక్కు చట్టం ద్వారా తగు న్యాయం చేయాలని రాష్ట్ర అర్టీఐ అధ్యక్షులు, ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ గౌరవ అధ్యక్షులు జె.సురేంద్రబాబు కోరారు. సోమవారం స్థానిక ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, ఎంపిడిఓ మహేష్, తహ సిల్దారు షబ్బీర్‌భాషా, ఇతర మండల స్థాయి అధికా రులను ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సకాలంలో స్పందించాలని కోరారు. సమాచారం కోసం అందించే వినతులను స్వీకరించి త్వరితంగా నివేదికలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, వెంకటరమణ, శంకర్‌నాయుడు, రెడ్డప్ప, హేమచంద్ర, మొగిలయ్య, సుందర్‌రాజు, రఘు, మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

అధికారులు పట్టించుకోవాలని వినతులు

రైల్వేకోడూరు, మార్చి 2 ప్రభాతవార్త




రైల్వేకోడూరు మండలంలో గ్రామ సచివాల యాల్లో పనిచేస్తున్న సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించడం లేదని భారీగా మండలంలో ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని పలుచోట్ల సచివాలయాల్లోను గ్రామీణ ప్రాంతాలలోనూ సిబ్బంది పూర్తిగా విధులకు హాజరు కాకుండానే పలు రకాల సాకులు చెబుతూ విధులు నిర్వహిస్తున్నారని మండలంలో ఆయా సచివాలయాలకు వెళ్లే సంబంధిత అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ఏదైనా అర్జీదారులు పనిమీద వెళితే ఖాళీ కుర్చీలు తప్ప సంబంధిత విధులు నిర్వహించే సిబ్బంది లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని బాధితులు పేర్కొంటున్నారు. కొంతమంది అటెండెన్స్ వేసుకొని అక్కడ పని ఉన్నది ఇక్కడ పని ఉన్నది క్యాంపుకు వెళ్ళమని కుంటి సాకులతో విధులు నిర్వహిస్తున్నారని వీరుపై చర్యలు తీసుకోవాలని కూడా బహిరంగంగా మండలంలో చర్చ సాగుతుంది. ఏది ఏమైనాప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో సచివాలయంలోకి సంబంధిత అర్జీదారులు వెళితే తిరిగి వెనక్కి రావాల్సిందే అని బోరున అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే వీరి లీలలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆకస్మిక తనిఖీతో డ్యూటీలకు దుమ్మా కొడుతున్న పని దొంగలు కొంతమంది దొరికే సందర్భాల్లో లేకపోలేదు.

## ఎస్‌వి వైద్య కళాశాల విద్యార్థులు క్రీడల్లో పతకాల పంట

తిరుపతి హెల్త్, మార్చి 2, ప్రభాతవార్త



ఎస్వీ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు వివిధ క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు వైద్య విద్యార్థులకు ప్రశంసాలు అందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఒక వైద్యంలోనే కాకుండా, మా ఎస్వి వైద్య కళాశాల వైద్య విద్యార్థిని, విద్యార్థులు, క్రీడల్లో ముందంజలో ఉండటం, ఎంతో సంతోషమని అదేవిధంగా మానసిక ఉల్లాసానికి, ఉత్తమమైన వైద్యం అందించడంలోనూ, ఆ వైద్య విద్యార్థులు ఎప్పుడు ముందుంటారని వైద్య విద్యార్థుల ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోజా రమణి మహిళా వైద్య విద్యార్థులకు అదనంగా మంచి డైట్, పౌష్టికాహారము, గుడ్డు పాలు, డ్రై ఫ్రూట్స్‌ను కూడా అందించవలసిందిగా ఈ సందర్భంగా ఆమెకి తెలిపారు. గత వారం తిరుపతి ఐఐటి సన్యోగ 26లో జరిగిన క్రీడల్లో ముందంజలో నిలిచిన వివిధ విభాగాల నుంచి పతకాల పంట పండించారు. టేబుల్ టెన్నిస్‌లో రన్నర్స్‌గా ఏ భార్గవి, కపర్తి గాయత్రి, సి ప్రసన్న జస్మిత, పి. దీరేనా, షాట్ పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన ఏ. జ్ఞాన ప్రసూన, రిలేలో సిల్వర్ పతకాలు సాధించిన బి వినయ్ కుమార్, సి.ఆధ్విన్ ప్రాఖ్యాతి, జీ.కే శ్రీనాథ్, కె. బెన్ను, లాంగ్ జంప్‌లో సిల్వర్ పథకం సాధించిన జీ.కే శ్రీనాథ్, హై జంపులో సిల్వర్ పతకం సాధించిన జీకే శ్రీనాథ్, వంద మీటర్ల రన్నింగ్స్ లో సిల్వర్ పతకం సాధించిన జీకే శ్రీనాథ్ సాధించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, డాక్టర్ డి ఎస్ఎన్. మూర్తి, సర్జరీ ప్రొఫెసర్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ రోజా రమణి, ఫిజికల్ డైరెక్టర్ శరవనన్, క్రీడల్లో పాల్గొన్న వైద్య విద్యార్థి విద్యార్థులు, మరియు ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీరకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అనాధ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు మార్చి 2 ప్రభాతవార్త



భిక్షాటన చేస్తూ జీవిస్తున్న 55 ఏళ్ల వృద్ధ మహిళ శవానికి ఎస్ఎస్ఐ అశ్వర్థ నారాయణ అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. భిక్షాటన చేస్తే ఒక మహిళ ఐదు రోజుల క్రితం పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో ఆమె తలకు గాయమైంది. వెంటనే ఆమెను పోలీసులు స్థానికుల సహాయంతో వైద్యశాలలో చేర్పించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఎవరు రాకపోవడంతో సోమవారం సాయంత్రం ఆమె శవానికి ఏఎస్ఐ అశ్వర్థ నారాయణ అంత్య క్రియలు నిర్వహించి నివాళులర్పించారు. ఆయన సేవ నిరతిని పలువురు ప్రశంసించారు.

## ప్రతినెల పాఠకులతో సమావేశం

- త్వరలో డిజిటల్ సేవలు ,- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్



చిత్తూరురూరల్, మార్చి 2 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చొరవతో త్వరలోనే గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేసి, చదువుకొంటున్న విద్యార్థులు, పాఠకులతో ముఖాముఖి చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. పాఠకులు కోరిన విధంగా గ్రంథాలయ పనివేళల పెంపు, తదితర సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖామంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. అలాగే ఇకపై గ్రంథాలయాల్లో ఎదురయ్యే సమస్యలను తెలుసుకొనేందుకు ప్రతినెల పాఠకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, వారి సూచనల మేరకు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, గ్రంథాలయాల బలోపేతానికి కొత్త సిలబస్‌తో కూడిన పుస్తకాల కొనుగోలు, మౌళిక వసతులపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆర్‌విఎస్ఎస్ శర్మ, ఇన్‌ఛార్జి డిప్యూటీ గ్రంథాలయాధికారి ఎన్ఎస్ లావణ్య, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, మార్చి 2 ప్రభాతవార్త:



ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజూషా దేశ్‌పాండే సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెం డెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగో పురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొ న్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వ హించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసా దాలను అందజేశారు.టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో రెండో ర్యాంకు

కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త



తిరుపతిలోని మనసంస్కృతి అధ్వర్యంలో జరిగిన నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో కుప్పం బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.వర్షిణి జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధిం చింది బహుమతి అందుకుంది. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థినులు పాల్గొనగా వర్షిణి ఉత్తమ ప్రతిభ కనబరచింది. గ్రామీణ ప్రాంతంలో చదువుతున్నా ఆంగ్ల భాషపై పట్టు సాధించి రెండో ర్యాంకు సాధించడం పట్ల హెచ్ఎం వెంకటేశ్వరబాబు, ఆంగ్ల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు వర్షిణిని అభినందించారు.

## ద్రవిడలో హాస్టల్ నిర్వహణకు ఆటోమేషన్ విధానం

కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త



ద్రవిడ విశ్వవిద్యాలయంలో హాస్టల్ నిర్వహణ కోసం ఆధునిక ఆటోమేషన్ విధానంను సోమవారం వైస్ చాన్సలర్ ఆచార్య ఎం. దొరసా ్వమి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వి.సి. మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానంతో హాస్టల్ ఫీజుల చెల్లింపు, గదుల కేటాయింపు, విద్యార్థుల వివరాలు డిజిటల్ రూపంలో నిర్వహిస్తారు. ఫీజుల చెల్లిం పులో పారదర్శకత పెరుగుతుంది. అవసరమైనపుడు తక్షణమే సమాచారం అందుబాటులో ఉండేలా ఈ విధానం సహాయపడుతుంది. వర్సిటీ విద్యార్థుల సంక్షేమం, పరిపాలన పారదర్శకత దిశగా వర్సిటీ మరో అడుగు ముందుకు వేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, చీఫ్ వార్డెన్ ఆచార్య శ్యామల, వార్డెన్లు ఆచార్య శ్రావణ్‌కుమార్,డా॥శైలమ్మ పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంతో రైతులకు లాభం

- ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు

కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త



సేంద్రీయ వ్యవసాయంతో రైతులకు ఎంతో లాభమని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గుడుపల్లె మండలం గుత్తార్లపల్లిలో గ్రామంలో ఆరోగ్యం, పోషణభద్రత, ఫుడ్ బాస్కెట్ కార్యక్రమంను ఈనెల 8న చేపట్టనున్న నేపథ్యంలో ర్యాలీ, మానవహారం ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన చిరుధాన్యాలు ఉ ంటాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, ఎఎంసి డైరెక్టర్ ఉదయ్‌కుమార్, షణ్ముగం, వెంకటస్వామి, సుధా రత్నం, అమరమ్మ, ధనమ్మ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు

- టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు పేదల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాయనూరు గ్రామంలో సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య విషయాలను టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌లో డిజిటల్ రూపంలో నమోదు చేయడంతో పాటు వారికి అత్యవసర వేళల్లో నిష్ణాతులైన వైద్యులతో వైద్య చికిత్సలు అందించేలా ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెఎస్ఎస్ సభ్యులు ప్రజలకు ఈ పథకంపై వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, నేతలు శివకుమార్, నాసప్ప, మురుగేష్, ప్రభు పాల్గొన్నారు.

## అనుమతుల్లేక చిట్‌ఫండ్‌లు నిర్వహిస్తే చర్యలు

శాంతిపురం, మార్చి 2 ప్రభాతవార్త



మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై నరేష్ హెచ్చరించారు. సోమవారం రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో చిట్‌ఫండ్ వ్యాపారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి చిట్ ఏజెంట్ సంబంధిత అధికారులనుంచి చట్టబద్ధమైన లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రజలు చిట్‌ఫండ్ నిర్వాహకుల గురించి ముందుగానే తెలుసుకోవాలన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా చీటీలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఆర్డీఓను కలసిన ఎంఆర్‌పిఎస్ నేతలు

కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కుప్పం ఆర్డీఓ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా దళితులపై దాడులు అరికట్టడంలో రెవెన్యూ శాఖ కఠినంగా వ్యవహరించాలని కోరారు. భూసమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, ప్రకాష్, పాపన్న, గోవిందప్ప, విజయ్‌కుమార్, పళని, జయప్ప, నాసిర్‌బాషా, ఆసిఫ్ బాషా, మహ్మద్ అలీ, అఫ్రాన్ బాషా పాల్గొన్నారు.

## టపాకాయల గోదాముల ఆకస్మిక తనిఖీ

తొట్టంబేడు,మార్చి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పొలిమేరల్లోని తొట్టంబేడు మండలంలోని సరిహద్దుల్లో గల టపాకాయల గోదాములను సోమవారం పోలీసు రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ తనిఖీల్లో డివైయస్‌పి నరసింహమూర్తి, తహశీల్దార్ భారతి వారి సిబ్బంది ఐదు గోదాములను తనిఖీ చేసారు. అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గోదాములో రికార్డుల్లో స్టాకు కంటే అదనంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. బిల్లులు లేకుండా లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. భద్రతా నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లఘిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## రిజర్వేషన్‌లపై ఉద్యమాలు: జిల్లా సదస్సులను విజయవంతం చేయండి:

శ్రీకాళహస్తి,మార్చి 2 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరగబోయే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సోమవారం సిఐఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జనమాల గురవయ్య కోరారు. సోమవారం పార్టీ కార్యలయంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి9న శ్రీకాళహస్తిలో జరిగే జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ రంగంలోలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు బలరాం, తులసీరాజన్, ఆర్‌గోపి, శివకుమార్, పులి శ్రీకాంత్, చందమాల కోటయ్య, చారులతలు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

-సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త:

వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 56 వినతులు అందాయి. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలోనే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912,1800 425 155333కు కాల్ చేయవచ్చని తెలిపారు.

## సమస్యలపై ఏకరవు!

నగరపాలకసంస్థ పిజిఆర్‌ఎస్‌కు భారీగా వినతులు

తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త:



తిరుపతి నగరంలోని 50 డివిజన్లలో పలు సమస్యలపై ప్రజలు అధికారులకు మొరపెడు తున్నారు. ప్రతివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు భారీగా పాల్గొని వినతులు అందిస్తున్నారు. సోమవారం 33 వినతులు స్వీకరించినట్లు కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు కమిషనర్ ను కోరారు. మహతి ఆడిటోరియం సమీపంలో త్రాగునీటితో మురుగునీరు కలుస్తుందని, చర్యలు తీసుకోవాలని, ఐ ఎస్ మహల్ వెనుకభాగంలో చెత్తకుప్పలు తొలగించాలని, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని, జయశ్యామ్ థియేటర్ సమీపంలో బహిరంగ మూత్ర విసర్జన అరికట్టాలని, బైరాగి పట్టేడ లో కాలువలు శుభ్రం చేయాలని, ప్రశాంతి నగర్ లో యూడీస్ లీకేజీ అరికట్టాలని, ఫుట్ పాత్ ఆక్రమణలు అరికట్టాలని, రవీంద్ర నగర్ లో త్రాగునీటి సరఫరా చేయాలని, సి ఎస్ ఆర్ కాలనీ లో అనధికారిక నీటి కనెక్షన్ తొలగించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## వస్త్ర రంగానిది కీలక పాత్ర

-కమిషనర్ మౌర్య

తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త:



దేశ ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగం కీలక పాత్ర పోషిస్తోందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. జౌళి మంత్రిత్వ శాఖ అనుబంధ టెక్సటైల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఓహోటల్ లో"మార్కెట్ ఫర్ టెక్స్టైల్స్ అండ్ క్లాథింగ్ (ఎంసీ టీ)" జాతీయ గృహ సర్వే శిక్షణా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వస్త్ర రంగం వలన ఉద్యోగ, ఉపాధికి ఎక్కువ అవకాశం ఉండన్నారు. ఈ పరిశ్రమల ఉత్పత్తిలో సుమారు 13 శాతం, జీడీపీకి 4 శాతం వంతు ఇస్తోందన్నారు. దేశం వ్యాప్తంగా ఈ సర్వే ద్వారా గృహాల స్థాయిలో వస్త్ర వినియోగంపై వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.

## శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి

పంచలోహ ఉత్సవ విగ్రహం సిద్ధం

సత్యవేడు, మార్చి 2 ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణం శ్రీకాళహస్తి మార్గంలో భక్తులు పూజలు అందుకుంటున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధిత నిర్వాహకులు ఉత్సవమూర్తి ఆంజనేయస్వామి విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఏప్రిల్ 12వ తేదీ హనుమాన్ జయంతి ఆలయంలో ఘనంగా నిర్వహించడంతో పాటు ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించడానికి ఆలయ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే పంచలోహాలతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించారు. ఆలయ నిర్వాహకులు, ధర్మకర్త నాగభూషణం సొంత నిధులతో పాటు దాతల నుంచి కూడా కొంత విరాళాలను సేకరించి పంచలోహ ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 12వ తేదీ మనుమాన్ జయంతి రోజున పంచ లోహాల ఆంజనేయస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పట్టణంలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని ఊరేగించనున్నారు.

## ఏపిఎన్‌జిఓ జేఏసి జిల్లా కమిటి ఎన్నిక

తిరుపతి హెల్త్, మార్చి 2, ప్రభాతవార్త



తిరుపతిలో ఏపిఎన్‌జిఓ జేఏసి తిరుపతి జిల్లా కమిటీ ఎన్నిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆ కమిటీ నందు తిరుపతి జిల్లాలో నిరంతరం కార్మికుల సమస్యలపైన అలు పెరుగని పోరాటం చేస్తూ నాయక త్వంలో అంచాలంచాలుగా ఎదిగి ప్రస్తుతం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న బిఎస్ బాబుని ఏపిఎన్‌జిఓ జేఏసి జిల్లా కమిటీ నందు కో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిఎస్ బాబుకి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## జగనన్న కాలనీలో జాతీయ గ్రామీణ క్రీడలు ప్రారంభం

తిరుపతిరూరల్, మార్చి 2 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో సోమవారం జాతీయ గ్రామీణ క్రీడా కేంద్రాన్ని తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మౌనిక మునిశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌనిక మునిశేఖర్ మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత యువతీ యువకులలో శారీరక దృఢత్వం, క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలోనే ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన క్రీడా సామాగ్రిని అందజేస్తున్నామని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పిడబ్ల్యు జూనియర్ కళాశాలను సందర్శించిన టిటిడి జేఈవో

తిరుపతి విద్య, మార్చి 2 ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలను టిటిడి జెఈఓ డా.శరత్ సోమవారం సందర్శించారు ప్రిన్సిపల్ డా. భువనేశ్వరి జెఈఓకి కళాశాల జరిగే వివిధ కార్యక్రమాలన్నింటిని ప్రదర్శించి వివరించడమైనది అనంతరం జెఈఓ తరగతి గదుల్ని, గ్రంధాలయాన్ని, డిజిటల్ క్లాసు రూమ్స్ కి వెళ్లి సందర్శించి తగిన సూచనలు చేశారు. కళాశాలలో గత సంవత్సరపు ఫలితాలపై సమగ్ర నివేదికను కోరారు గత సంవత్సరం వచ్చిన 97శాతం ఫలితాలకు అభినందించి ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలు తీసుకురావాలని దిశా నిర్దేశం చేశారు కళాశాలకు కావలసిన వివిధ మౌలిక వసతుల్ని అదేవిధంగా హాస్టల్ కు కావలసిన పలు సౌకర్యాల పైన ఆరా తీసి వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులని ఆదేశించారు. కళాశాల ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసేలా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకుల బోధన మెరుగుపరచుకొని, పోటీ, ఎంట్రెన్స్ పరీక్షల పైన కూడా దృష్టి సారించి కళాశాల ప్రతిష్టను అగ్రగామిగా నిలపాలన్నారు. ఫలితాల విషయంలో సంబంధిత అధ్యాపకులు పూర్తిస్థాయి బాధ్యత వహించాల్సి ఉంటుందని, విద్యార్థినులకు ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కార బాక్స్‌లో రాతపూర్వకంగా రాసి వేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భన కార్యక్రమంలో టీటీడీ డీఈఓ వెంకట సునీలు, సూపరింటెండెంట్ శివ, సుశీల, ఇంజనీరింగ్ అధికారులు ఉదయ్, దామోదర్ హాస్టల్ వార్డెన్ స్నేహలత, జయమ్మ, తదితర అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేట్ లెవల్లో ప్రతిభా విద్యాలయ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తిరుపతి విద్య, మార్చి 2 ప్రభాత వార్త





ఆదిత్యాస్ లర్నీ టెక్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు హరినాథపురంలోని రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్ వేదికగా జరిగిన స్టేట్ లెవల్ అబాకస్ పోటీలలో తిరుపతి భవాని నగర్ లోని ప్రతిభా విద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. ఈ సంధర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ బొమ్మి మిల్టన్ మాట్లాడుతూ అబాకస్ స్టేట్ లెవల్ కాంపిటేషన్లో తమ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి వర్షిని స్టేట్ ఫస్ట్ ప్లేస్ సాధించగా, రెండవ తరగతి విద్యార్థి రాఘవ స్టేట్ సెకండ్ ప్లేస్ సాధించారని చెప్పారు. తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడం పాఠశాలకు గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు.

## ఆక్రమణలకు చెక్‌పెట్టిన రెవెన్యూ అధికారులు

రేణిగుంట మార్చి 2 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కుర్ర కాలవ రెవెన్యూ లెక్క దాఖలు సర్వే నంబర్ 5/1,2,208/1,2,/209/1,2 నందున్న 4.21 సెంట్ల భూమిని ఆక్రమణ దారుల నుండి రెవిన్యూ అధికారులు విముక్తి కలిగించారు. ఆదివారం కొంతమంది భూమిని ఆక్రమిస్తున్నారన్న అభియోగాలపై స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రజా ప్రయోజనార్థం భూమిని స్వాధీనం చేసుకొని భూమిలో హెచ్చరిక బోర్డును నాటినట్లు తాహాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

## శివయ్య సేవలో అడిషనల్ అడ్వకేట్ జనరల్

శ్రీకాళహస్తి,మార్చి 2 ప్రభాతవార్త



వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్ కుటుంబ సభ్యులతో పూజలు జరిపించుకున్నారు. ఇక్కడకు వచ్చిన ఆయన ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని ఎఇఓ మోహన్‌ను కోరారు. ఆయన వెంటనే టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడుకు ఆదేశించారు. ఆయన ప్రత్యేక టిక్కెట్లులో సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులను ఏర్పాటు చేసారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## మహిళా సాధికారితే అభివృద్ధికి పునాది

శాంతి దుర్గ

తొట్టంబేడు,మార్చి 2 ప్రభాతవార్త



ఏ సమాజంలో అయితే మహిళలు పూజింపబడతారో ఆ సమాజం ప్రాంతం సుబిక్షంగా ఉంటుందని 'మహిళా సాధికారితే అభివృద్ధికి పునాది' అని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు శాంతి దుర్గ అన్నారు. సోమవారం ఆమె ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం కూడా మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుటకు పథకాలు ప్రణాళికలు అమలు చేస్తున్నారని వివరించారు. ఆది నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన హాయాంలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు మహిళ సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించారని వివరించారు. ఈ నెల 8న మహిళా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మార్చి 7న విజయవాడలో జరిగే భారీ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు కే.ఆర్ సూర్యనారాయణ ఆదేశాలతో ఛలో విజయవాడ సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను తెలుగుగంగ కాలనీలోని డివిజన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతి దుర్గ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు. మహిళా ఉద్యోగుల సమస్యలు వారి హక్కులు సాధికారితపై చర్చించేందుకు విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమాలకు ప్రతి ఒక్క మహిళా ఉద్యోగి హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశం మహిళల్లో నూతన ఉత్తజం నింపుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు రాష్ట్రకౌన్సిలర్ఎస్‌విజయలక్ష్మీ, కార్యదర్శిబాషా, ఉపాధ్యక్షులు జయలక్ష్మీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## భక్తులకు ఆహార పొట్లాల వితరణ

శ్రీకాళహస్తి,మార్చి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో లోక్‌సత్తా సారధ్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. లోక్‌సత్తా ఉమ్మడి చిత్తూరుజిల్లాల మాజీ అధ్యక్షుడు టి.లోకేష్‌బాబు 8వ వర్థంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆలయానికి వచ్చిన భక్తులకు భోజనం పాకెట్లుతో పాటు మంచినీటి పాకెట్లను అందించారు. ఈ కార్యక్రమాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ టి.రమేష్‌బాబు, సభ్యులు అజా ర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్స్పైర్ అవార్డుకు గ్రామీణ విద్యార్థులు

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 2 ప్రభాతవార్త





ప్రభుత్వ పాఠశాలలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు చిచ్చర పిడుగుల్లా రెచ్చిపోతున్నారు. గ్రామీణ స్థాయిలోని పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభా పాటవాలను వెలికి తీయటంలో ఉపాధ్యాయులు తమ శ్రద్దను వెలికి తీస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఉదంతిక, రక్షితలు సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ పోటీలలో ఇన్స్పైర్ అవార్డుకు ఎంపిక చేసారు. వదంతికి రహాదారి భద్రతపై అవగాహన, ద్విచక్రవాహన దారులకు అవగాహన పరచుటకు ఆటోమేటిక్ ఇంజన్ లౌకింగ్ విధానం, డ్రంకన్ డ్రైవ్ అనే అంశాలపై ప్రదర్శనలుఅందించారు. రక్షిత జీవశాస్త్రంలోని పక్షులు జంతువులకు రేడియేషన్ తగ్గించుటకు ప్రొటెక్షన్ ఆఫ్ బర్డ్ అండ్ ఎనిమిల్స్ ప్రాజెక్టులును అందించారు. వీరిద్దలు జిల్లా స్థాయి అవార్డుకుఎంపికయ్యారు. వీరికి సైన్స్ ఉపాధ్యాయురాలు లింకన్, సుజాతలు అభినందించారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

## ప్రజలకు సంతృప్తికర సేవలు



తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో పిజిఆర్‌ఎస్‌లో వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఉదయం పోలీస్ కార్యాలయానికి వచ్చిన బాధితుల నుండి సిఐలు వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించారు. సిఐలు పివిఎస్ రామకిశోర్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వరదయ్యపాలెం-తడ రహదారికి మరమ్మతులు చేపట్టాలి

- ప్రజా ప్రయోజనార్థం పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు

వరదయ్యపాలెం, మార్చి 2, ప్రభాతవార్త

వరదయ్యపాలెం నుండి తడకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలతో దెబ్బతిన్న నేపథ్యంలో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నప్పటికీ, రహదారి దుస్థితి కారణంగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల గుంతలు మరింత లోతుగా మారి వాహనదారులకు ప్రమాద సూచకంగా మారుతున్నాయి. ఈ సమస్యను ప్రజా ప్రయోజనార్థం పరిగణనలోకి తీసుకొని డివిఎంసి మెంబర్ గుత్తి త్యాగరాజు, కన్వినర్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం, ప్రజల తరఫున పిజిఆర్‌ఎస్‌లో డిఆర్ఓ నరసింహులు ద్వారా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ దృష్టికి అధికారికంగా తీసుకెళ్లారు. సంబంధిత అధికారులను తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థికి అభినందన



పాకాల, మార్చి 2, ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి దినకర్‌ను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్వి రమేష్ కు మార్, అధ్యాపకులు అభినందించారు. బెంగళూరు లోని డాక్టర్ మన్మోహన్ సింగ్ బెంగళూరు సిటీ యూనివర్సిటీలో వారం రోజుల పాటు జరిగిన ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత క్యాంపులో దినకర్ పాల్గొన్నాడు. అక్కడ నిర్వహించిన జానపద పాటల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విద్యార్థి దినకర్ ను కళాశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి డాక్టర్ మాసులామణి, అధ్యాపకులు చిట్టి కళావతి, మోహనో బెహరా, ఈశ్వరబాబు, రమణమ్మ, రేఖ, కుమార్ రాజా, ఢిల్లీ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

ప్రొఫెసర్ ఆదినారాయణ గోరజాన

రామచంద్రాపురం, మార్చి 2 ప్రభాతవార్త:





ఫార్మశీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు వుందని విశాఖ పట్టణానికి చెందిన శ్రీనివాస రావు ఫార్మశీ కళాశాల ప్రొఫెసర్ ఆదినారాయణ గోరజాన అన్నారు. సోమవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఫార్మశీ కెరియర్స్ ఇన్ ది ఏఐ ఎరా అనే అంశంపై కళాశాల ఐక్యూఏసి, ఐఐసి ఆర్2డి సెల్ సంయుక్తంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఫార్మారంగంలో వున్న ఉపాధి అవకాశాలు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, ఫార్మా డి విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసిపి 22వ వార్డు కమిటీ ఎంపిక

పుత్తూరు (నగరి), మార్చి 2 ప్రభాతవార్త :



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి నగరి మునిసిపాలిటీ 22వ వార్డు కమిటీ, అనుబంధ కమిటీలను నియమించారు. సోమవారం వార్డులో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆదేశాల మేరకు కమిటీలు నియమించినట్టు పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పార్టీని వార్డు స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు క్యాడర్ కష్టపడి, ఐక్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం క్యాడర్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ భూపాలం, నాయకులు సర్వనం, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధనల్లో ఉన్నత ప్రమాణాలు పాటించాలి

వీసీ టాటా నర్సింగరావు

తిరుపతి విద్య, మార్చి 2 ప్రభాతవార్త



పరిశోధనల్లో వేగంతో పాటు ఉన్నత ప్రమాణాలు పాటించాలని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ నరసింగరావు ఫిజిక్స్ స్కాలర్లకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగాన్ని ఆయన సందర్శించి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్షాలతో పరిశోధనలు చేపట్టాలని, విద్యార్థులు వర్సిటీలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన జర్నల్స్ లో పరిశోధనా వ్యాసాలు ప్రచురించాలని సూచించారు. పరిశోధకులు పర్యవేక్షకుల సూచనలు, సలహాలతో పనిచేయాలని, ప్రయోగశాలలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరై పరిశోధన పత్రాలను సమర్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పరిశోధన ఫలితాలను సమాజానికి చేరవేయాలని కోరారు. ఫిజిక్స్ విభాగానికి చాలా గొప్ప చరిత్ర ఉందనీ, ఇక్కడ పరిశోధన చేయటం మంచి అవకాశమన్నారు. ఫిజిక్స్ రంగంలో అవగాహన కలిగిన వారికి ఉన్నత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో రిమోట్ డ్రోన్ పైలట్ శిక్షణ ప్రారంభం

తిరుపతి విద్య మార్చి 2 ప్రభాతవార్త



డ్రోన్ స్పేస్ టెక్నాలజీ భాగస్వామి పీబీసీ ఏరోహబ్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎస్వీయూలో విద్యార్థులకు రిమోట్ డ్రోన్ పైలెట్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్సిటీలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని వీసీ టాటా నర్సింగరావు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని రూసా ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్లో మొదటి రెండు బ్యాచ్లలో నమోదు చేసుకున్న 40 మంది విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమం 15 రోజుల పాటు జరగుతుందని తెలిపారు. డ్రోన్ ఆపరేషన్లు, మ్యాపింగ్లో శిక్షణ ఇస్తామని, విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని విద్యార్థుల కోసం ఈ శిక్షణ ప్రత్యేకంగా రూపొందించబడిందని చెప్పారు. ప్రవేశం పొందిన వారందరూ తప్పకుండా తరగతులకు హాజరు కావాలని కోరారు. రిమోట్ పైలట్ శిక్షణ సంస్థగా పనిచేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుండి అధికారిక ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్లోని మొట్టమొదటి జనరల్ స్టేట్ యూనివర్సిటీగా ఎస్వీయూ అవతరించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, రూసా సీఈఓ వంశీరాయల్, ప్రొఫెసర్ కేవీ సుచరిత, ఆచార్య బాలాజీ, విద్యార్థులు, ట్రైనర్లు పాల్గొన్నారు.

## సత్తా చాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు.

తిరుపతి విద్య మార్చి 2 ప్రభాత వార్త



భారత ప్రభుత్వ సంస్థ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్మెంట్ బెంగళూరు నందు నిర్వహించిన నిర్వాహ 2026 దక్షిణ భారత వ్యవ సాయ విశ్వవిద్యా ల యాల సాంస్కృతిక మరియు వక్తృత్వ పోటీల నందు శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు షార్ట్ ఫిల్మ్ వీడియో ప్రొడక్షన్ నందు మూడవ సంవత్సరం బిఎస్సి అగ్రి విద్యార్థులు రాజేష్ కుమార్, అనిల్ కుమార్ మొదటి బహు మతి పొందడం జరిగిందని , డిబేట్ , మానవ వనరుల విభాగం నందు జ్ఞాన ప్రసూన ద్వితీయ బహు మతిని పొందడం జరిగిందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ విద్యార్థినీ, విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేటెడ్ మాట్లాడుతూ ఇటు వంటి కార్యక్రమాలలోప్రాంతీయజాతీయస్థాయిలో విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు.

## కోర్సుల పరీక్ష ఫీజు చెల్లింపుకు 13 ఆఖరు గడువు

తిరుపతి విద్య మార్చి 2 ప్రభాత వార్త

ఎస్వీయూ పరిధిలో మూడు, ఐదు సంవత్సరాల లా కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు పలు సెమిస్టర్ పరీక్షల కోసం ఈనెల 13 వతేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారాన్ని ఇప్పటికే అన్ని లా కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపిచడం జరిగిందన్నారు. అలాగే ఈనెల 25 నుంచి పలు కోర్సుల విద్యార్థులకు పరీక్షలు

**CHANGE OF NAME & SURNAME**

I, Mahaboob Bee Sayed (old name) Presently Residing at Plot No. 31-A, Shanvika Priya Town Ship, Akuthotapalli Village, Ananthapuramu Rural Mandal, Ananthapuramu District, AP PIN - 515003, I have changed my Name & Surname from MAHABOOB BEE SAYED (old name) to **LAVANOOR SHAIK MAHABOOB BI** (new name). for all purposes W/o. **SAYED SHABBEER AHAMMAD.**

# అంగన్‌వాడీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే





సూళ్లూరుపేట, మార్చి 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో అంగన్ వాడీలను ఆర్థికంగా మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2025 సంవత్సరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండుసార్లు వేతనాలు పెంచిందని తెలిపారు. అలాగే 75కోట్ల రూపాయలు వ్యయం చేసి అంగన్‌వాడీలకు అధునాతన సెల్‌ఫోన్లను అందజేసిందని చెప్పారు. గతంలో 70 శాతం ఉన్న అంగన ్వాడీల హాజరు 96 శాతానికి పెరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో అంగన్‌వాడీల న్యాయపరమైన కోర్కెలు తీర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 30 రోజులు వేసవి కాలంలో సెలవు దినాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని నెలవల విజయశ్రీ చెప్పారు.

**విమర్శలకు భయపడే ప్రసక్తే లేదు:**

కొంతమంది తనపై తన కుటుంబంపై లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని వాటిని తాను పట్టించుకోనని నెలవల విజయశ్రీ చెప్పారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో అవినీతికి తావులేని పాలన అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి చేయడం చూసి కొంతమంది పనిగట్టుకుని తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తన తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం రాజకీయ అనుభవం ఉన్న నేతగా ఆయన వద్ద సూచనలు తీసుకుంటున్నానే గాని ఆయన పాలన విషయాల్లో ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోకి ప్రవేశించి జాతీయ రహదారిపై గల హోలీక్రాస్ జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలతో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం తో పాటు గాయాల పాలవుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో భాగంగా హోలీక్రాస్ జంక్షన్ వద్దకు వెళ్లి సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ అజయ్‌కుమార్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, సీనియర్ టిడిపి నేత తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, బొమ్మన ఫణి, చిట్టేటి పెరుమాళ్లు, దంతాల రవి, అలవల శ్రీనివాసులు, పామూరు మునస్వామి, కొండల రావు, ఆలీభాయ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

డక్కిలి,మార్చి 2.ప్రభాతవార్త; ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు అదికారులు తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దారు ఎం.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పలు గ్రామాలకు చెందిన వారు సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు.తహశీల్దారు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలకు సంబందిత వీఆర్వోలు గ్రామాల్లో విచారించి ప్రజలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈనెల 3,4,5 తేదిల్లో తిరుపతిలో జరగనున్న జనగణకు సంబంధించి శిక్షణా తరగతులకు వెళ్లాల్సినందు వల్ల ఈ మూడు రోజులు అందుబాటులో తాను ఉండడం లేదని,డిప్యూటి తహశీల్దారు ప్రసన్న కుమారి విధుల్లో ఉంటారని తెలియజేశారు.ఈకార్యక్రమంలో దక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి!

నాయుడుపేట, మార్చి 2 ప్రభాతవార్త: నాయుడుపేట మండల పరిధిలోని బిరదవాడ జాతీయ రహదారి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం కారు ఢీకొన్న ప్రమాదంలో చిల్లకూరు మండలం కలగుర్తిపాడు గ్రామానికి చెందిన తీపలపూడి దొరస్వామి దుర్మరణం చెందాడు. బిరదవాడ క్రాస్ రోడ్డు వద్ద దొరస్వామి రోడ్డు దాటుతున్న క్రమంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్యవైశ్య అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



నాయుడుపేట, మార్చి 2 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు కిషోర్ కుమార్ మొట్టమొదటి తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై చర్యలు : సిఐ



వెంకటగిరి, మార్చి 2 ప్రభాతవార్త: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలోని టిడ్కో, ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 112 గృహాలను క్షుణ్ణంగా పరిశీలి 17 మోటార్ సైకిళ్ళు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఏడుకొండలు, కామినేని గోపి, శివశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దంతాల సంరక్షణ పట్ల శ్రద్ధ చూపాలి



వెంకటగిరి, మార్చి 2 ప్రభాతవార్త: దంతాల సంరక్షణ పట్ల తగు శ్రద్ధ చూపాలని డాక్టర్ చల్ల సుమన్ తెలిపారు. స్థానిక విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమన్ ప్రజా దంత వైద్యశాల వారి సుమన్ ప్రజా దంత వైద్యశాల చీఫ్ కన్సల్టెంట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా సుమన్, ఒరుగుంటి డాక్టర్ లీల కేశవులు, డాక్టర్ భవానీ లహరి పాల్గొని విద్యార్థులకు ఉచిత డెంటల్ చెక్ అప్ నిర్వహించారు.ఏఐ టెక్నాలజీతో దంతాలు, చిగుళ్ల పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు సరైన బ్రషింగ్ పద్ధతులు, నోటి ఆరోగ్యం పై అవగాహన పరీక్షలు చేయించుకున్న విద్యార్థులందరికీ ఉచిత టూత్‌పేస్ట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎం. విజయశేఖరం, ఆర్ఆర్సి కోఆర్డినేటర్ డా.ఎం వెంకటసుబ్బయ్య, ఎన్ఎస్ఎస్‌పిఓఎం మాల్యాద్రి, అధ్యాపకులు లోకేశ్వర నాయుడు, యుగంధర్, మంజునాథ్, ఉమామహేశ్వర, నిరుపమ పాల్గొన్నారు.

## రేపు అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం

బాలాయపల్లి, మార్చి 2 ప్రభాతవార్త: బాలాయపల్లి మండలంలోని పెరిమిడి గ్రామంలో వెలసియున్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో 84వ ఆనంద అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ఈ నెల 4న జరుగుతుందని పెరిమిడి బ్రహ్మానంద పండరీ భజన బృందం తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 4న రాత్రి పెరిమిడి గ్రామంలో శ్రీ పాండురంగస్వామి వారి అగ్నిగుండ ప్రవేశము విచిత్ర ధ్వజాలం కరణతో, నవవిధ వాయిద్యాలతో, అలంకరణలతో, ఘనంగా జరుగుతుందని పెరిమిడి బ్రహ్మానంద పండరీ భజన బృందం తెలిపారు. అలాగే గ్రామోత్సవం, ఇతర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునని పెరిమిడి బ్రహ్మానంద పండరీ భజన బృందం తెలియజేశారు. ఈ అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా నెల్లూరు నారాయణ హాస్పిటల్ వారి ప్రత్యేక వైద్యులతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారని పెరిమిడి బ్రహ్మానంద పండరీ భజన బృందం తెలిపింది.

## 125 రోజుల ఉపాధి హామీ పోస్టర్ విడుదల



వాకాడు, మార్చి 2 ప్రభాతవార్త: 100 రోజుల ఉపాధి హామీ పనులను 125కు రోజులు పెంచడం జరిగిందని, అందులోని భాగంగా 125 రోజుల ఉపాధి హామీ పోస్టర్‌ను డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ఏపీవో విజయ విడుదల చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదానం మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పుడు ఉన్నటువంటి ఎంజిఎన్ఆర్ ఇజిఏ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం విబి జి రామ్ జి రూపాంతరం చెంది పేద ప్రజలకు మరిన్ని ప్రయోజనాలను అందించనుందని ఆయన తెలిపారు. ఏపీఓ విజయ మాట్లాడుతూ కొత్త పథకం ద్వారా 125 రోజులు ఉపాధి హామీ పనులు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ మల్లికార్జున రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రూ 1.50 కోట్లతో బీచ్ రోడ్డుకు భూమి పూజ



వాకాడు, మార్చి 2 ప్రభాతవార్త: మండలంలోని మరియమ్మ గుడి నుండి తూపిలి పాలెం బీచ్ రోడ్డు నిర్మాణానికి సోమవారం కోటి 50 లక్షల రూపాయలతో మండల టిడిపి కమిటీ ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ చూసినల మేరకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వాకాడు నుండి దుగరాజపట్నం మరియమ్మ గుడి దగ్గర నుంచి కొండూరు, తూపిలి పాలెం బీచ్ వరకు ఆర్అండ్‌బి రోడ్డును వేయడం జరుగుతుందన్నారు. ఈ రహదారి వలన ప్రజలకు సులభతరంగా రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి జనార్దన్‌రెడ్డి, అరుణ్ కుమార్, దయాకర్, గోవిందయ్య, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య మృతికి నాయకులు సంతాపం

బాలాయపల్లి, మార్చి 2 ప్రభాతవార్త: మండలంలోని పిగిలాం కొత్తపాలెంకు చెందిన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, టిడిపి నేత మతకాల శంకరయ్య మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి పలువురు టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను మండల టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు, సాగు నీటి సంఘం అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు తదితరులు పరామర్శించారు.

## సౌత్రియం భూముల ఆక్రమణ అరికట్టాలి

**- వికేఆర్‌పై కాలనీ గిరిజనులకు రక్షణ కల్పించాలి**



వరదయ్యపాలెం, మార్చి 2 ప్రభాత వార్త: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలంలోని వెన్నెల కంటే రాఘవయ్య గిరిజన కాలనీ వాసులు సోత్రం భూములు దురాక్రమ ఆపాలని గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములు ఇళ్ల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, అడిగినందుకు వీకేఆర్పై గిరిజన కాలనీపై రాత్రికి రాత్రులలో వచ్చి భయపెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్న వారి నుండి రక్షణ కల్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వరదయ్యపాలెం తహసిల్దార్ కార్యాలయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు ముట్టడించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కమిటీ కార్యదర్శి అంబాకం చిన్ని రాజు మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం జాయింట్ కలెక్టర్‌గా రామచంద్రారెడ్డి ఉన్న సందర్భంలో గిరిజనుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వెన్నెల కంటి రాఘవయ్య స్పూర్తిగా గిరిజనులందరినీ ఒక్క దగ్గరకు చేర్చి రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతులు తీసుకునే ఐఏఎస్ అధికారిగా తనకున్న అధికారాలను ఉపయోగించి వరదయ్యపాలెం మండలం పాదిరి కుప్పంలోని క్షత్రియ భూములలో ఇళ్ల పట్టాలు సాగుభూములు ఇవ్వడం జరిగిందన్నారు. గిరిజనులకు ఇచ్చిన భూముల పక్కనే హీరో మోటార్స్ అపోలో టైర్స్ లాంటి భారీ పరిశ్రమలు రావడం ఆ భూములకు విపరీతమైన విలువలు పెరగడంతో కొంతమంది రాజకీయ నాయకులు డబ్బులు ఉన్న పెత్తందారులు ఆ భూములపై కన్నేసి గిరిజనుల యొక్క సామాజిక సాంఘిక చదువు లేని వెలుగుబడుతనాన్ని ఆసరాగా చేసుకుని భయాన్నో నయానో ఆ భూములను కాజేసి అందులో పెద్ద పెద్ద అపార్ట్మెంట్లు పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా 20 సంవత్సరాల నుంచి తతంగం జరుగుతా ఉందని చిన్ని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుర్ర చంద్రశేఖర్, పొన్నేరి, బాల గురునాథం, కృష్ణమూర్తి, ఏఐటియుసి నియోజకవర్గం కార్యదర్శి చంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి ధనుంజయలు శెట్టి, గిరిజన సంఘం నాయకులు చెల్లమ్మ, రమేష్, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అవిలాలలో భూ కబ్జాలపై తక్షణం చర్యలు తీసుకోండి

**-విఆర్వో, ఎంఆర్ఐకి ఆదేశాలు జారీ**



తిరుపతిరూరల్, మార్చి 2 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సర్పంచ్ చెందెలి వెంకటరమణ ఆరోపించారు. మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ భూముల ఆక్రమణల గురించి ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 145/1, 146లో ప్రభుత్వ భూములలో అనుమానాస్పద అక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని వాపోయారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అవిలాలలో జరుగుతున్న భూ అక్రమణలపై స్పందించిన కలెక్టర్ తిరుపతిరూరల్ రెవెన్యూలు తక్షణమే చర్యలు తీసుకోవాలని విఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమణలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరును వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం సహించబోమని హెచ్చరించారు.

# కాణిపాకంలో ఘనంగా అరుణోదయం పుస్తకావిష్కరణ





కాణిపాకం, మార్చి 2 ప్రభాతవార్త: మాజీమంత్రి గల్లా అరుణకుమారి జీవిత చరిత్రపై రచించిన అరుణోదయం పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కాణిపాకంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. గల్లా అరుణ కుమారి జీవిత చరిత్రపై రచయిత రమేష్‌నాయుడు అరుణోదయం పుస్తకాన్ని రచించారు. ఈపుస్తకాన్ని కాణిపాకం ఆలయంలో బంగారు ధ్వజస్థంభం వద్ద వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అరుణకుమారి,పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఆస్థానమండపంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ అరుణకుమారి చంద్రగిరి ఎమ్మెల్యేగా వున్న సమయంలో కాణిపాకం ఆలయం అభివృద్ధికి బీజం పడిందన్నారు. నాడు భక్తుల సౌకర్యార్థం లక్ష రూపాయలతో ప్రవేశపెట్టిన నిత్యాన్నదానం కార్యక్రమంకు నేడు 65 కోట్లు రూపాయల వరకు కార్పస్‌ఫండ్ చేరుకుందన్నారు. అలాగే అరుణకుమారి హయాంలో దేవస్థానంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.ఈసందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ కాణిపాకం ఆలయ అభివృద్ధికి ఉభయదారులు ఎంతో విలువైన భూములను అందించి సహకరించారని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన న్యాయం చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, దేవాదాయ మాజీ అదనపు కమీషనర్ కేశవులు, డీపీఓ సుధాకర్,పుస్తక రచయిత రమేష్‌నాయుడు,ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనపాల్, ఆలయ మాజీ ఛైర్మన్ జగన్నాథరెడ్డి, టీడీపీ నాయకులు హరిబాబు నాయుడు, గిరిధర్‌బాబు, మధుసూన్‌నాయుడు, పూర్ణచంద్రరావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇదిలా వుండగా కాణిపాకం పుస్తకావిష్కరణకు విచ్చేసిన మాజీ మంత్రి గల్లా అరుణకుమారికి ఆలయ వెలుపల స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు, అలాగే ఆలయ రాజగోపురం వద్ద ఛైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీరక్వచం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ సహకారంతో లైబ్రరీ పైకప్పు పునర్నిర్మాణం

**-గ్రంధాలయ శాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి గురవారెడ్డి**



చంద్రగిరి, మార్చి 2 ప్రభాతవార్త: ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు అవసరమయ్యే బుక్ మెటీయల్స్ ను అందుబాటులోకి తీసుకు వస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. స్థానిక పాతపేటలోని గ్రంధాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠకులతో మమేకమై గ్రంధాలయ నిర్వహణ, పనితీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో పాఠకులు గ్రంధాలయం పైకప్పు శిధిలావస్థలకు చేరుకున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రంధాలయ పైకప్పును తొలగించి పునర్నిర్మించాలని కోరారు. అదేవిధంగా పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు అవసరమైన బుక్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఎంఎల్ఏ పులివర్తి నాని సహకారంతో గ్రంధాలయ పైకప్పు పునర్నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రంధాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠకుల సంఖ్యను మరింత పెంచే దిశగా చూడాలని గ్రంధాలయ అధికారి రెడ్డెమ్మకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు సుబ్రమణ్యంరెడ్డి, కేశవులు నాయుడు, జైపాల్ నాయుడు, నాగరాజన్, హేమచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో బోయపాటి



ఏర్పేడు,మార్చి 2 ప్రభాతార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో సోమవారం ప్రముఖ సినీమా డైరెక్టర్ బోయపాటి శ్రీను కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన ద్వారం వద్ద వేదపండితులతో ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి, వేదపండితుడు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి బత్తలగిరినాయుడు మహాకుంబాభిషకం గురించి వివరిస్తూ ఆహ్వానించారు. ఇంకా ఆహ్వాన పత్రికలను ముద్రించలేదని ఏప్రిల్ 19 నుంచి 23వరకు నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించగా తప్పక వస్తామనన్నారు.

## భద్రతల విషయంలో అప్రమత్తత ఎంతో అవసరం!



శ్రీకాళహస్తి,మార్చి 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రత విషయంలో అప్రమత్తత ఎంతో అవసరమని అక్టోపస్ డివైయస్‌పి బి.మధుసూధనరెడ్డి అన్నారు. సోమవారం పరిపాలనా భవనాల్లోని సమావేశం హాలులో అక్టోపస్ అధికారులు సిబ్బంది సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ఈ సమావేశానికి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. చుట్టుకొండల పక్కన ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేసే భద్రతా సిబ్బంది,సెక్యూరిటి సిబ్బంది సుశిక్షితులుగా ఉండాలన్నారు. నేడు సమాజంలో పరిస్థితులను అన్వయించుకుంటూ ఆలయాల్లో భద్రత విషయంలో ఎంతో జాగురూకత అవసరం అన్నారు.ఈ సందర్భంగా ఇక్కడ అక్టోపస్ మాక్ డ్రిల్ నిర్వహించే విషయంపై చర్చించారు.ఈ సమావేశంలో ఆలయ ఇఓ బాపిరెడ్డితో పాటు డివైయస్‌పి బి.మధుసూధన్‌రెడ్డి, ఆర్ఐ టి.గోపిచంద్, యంఆర్‌సి నాయక్, సిఐ జి.ప్రకాష్‌కుమార్, శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ ప్రకాష్‌కుమార్, ఇన్‌చార్జి తహశీల్దార్ అనిల్‌కుమార్,అగ్నిమాపక దళ అధికారి ఎన్ నాగేశ్వరరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, ఆలయ సిఎస్‌ఓ టి.రవి, ఆలయ ఎఇఓ కే.విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషనం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్య గుంట గంగమ్మ ... అభిషేకాల వేళల మార్పు



తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 6,7తేదీల్లో లక్షకుంకు మార్చన సందర్భముగా శుక్రవారం,8న తేది ఆదివారంలో ఉదయం 7 గంటలకు జరగవలసిన అభిషేకాన్ని ఉదయం 5గంటలకే నిర్వహిస్తారు. భక్తులు గమనించి సహకరించవలెనని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్,ఆలయ ఈఓ ఎ. జయకుమార్ తెలిపారు.

**-నేడు ఆలయం మూసివేత:**

చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం గంగమ్మ ఆలయాన్ని నేడు 9 గంటలకు మూసివేసి వేస్తారని, తిరిగి మరుసటి రోజు బుధవారం ఉదయం తెరచి 6 గంటల నుంచి భక్తులు యదావిధిగా అమ్మవారిని దర్శించుకొనవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

## తిరుపతి నుండి పార్టీని బలోపేతం చేయించండి

**-గౌడపేరుతో రాహుల్‌గాంధీ**




తిరుపతి,మార్చి 2ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతినియోజకవర్గం నుండే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయించేలా చూడాలని, అక్కడ నుండి పార్టీ అధికారం చేపట్టేలా పనిచేయాలని కాంగ్రెస్ ఎంపీరాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ వికారాబాద్ జిల్లా హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల జిల్లాల అధ్యక్షులకు సంగతున్ సృజన్ అభియాన్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధినేత రాహుల్‌గాంధీకి తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న తిరుపతి అర్బన్ డిసిసి అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబుతో రాహుల్ ఆత్మీయంగా మాట్లాడారు.

## ముగిసిన మలయప్ప తెప్పోత్సవాలు



తిరుమల,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి పుష్కరిణిలో జరుగుతున్న శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. చివరగా ఐదవరోజు సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. ఉత్సవమూర్తులు ఆశీనులై పుష్కరిణిలో ఏడుచుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈ తెప్పోత్సవంలో చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.


### నగరపాలక సంస్థ, తిరుపతి

**ప్రకటన**

శ్రీ ఎం.వెంకటమోహన్‌ప్రసాద్ తండ్రి యం.చెంగల్రాయులు వారు తేది **01-11-2019**న తిరుపతి నగర పాలక సంస్థ నందు జూనియర్ అసిస్టెంట్‌గా నియామకము కాబడిన పిదప, తేది **27-06-2022** నుండి తేది **26-06-2024** వరకు వేతన రహిత సెలవును వాడుకున్న పిదప, ఈ కార్యాలయ ఆదేశమును ఉల్లంఘించిన విధులకు హాజరు కాకపోవుటచే సంజాయిషీ కోరుతూ ఇచ్చిన షో-ఆజు నోటీసులు జారీ చేయడం జరిగినది. అయితే సేవా పుస్తకము నందు నమోదు చేయబడిన అడ్రెస్‌కు రిజిష్టరు పోస్టు చేయగా, ఆ అడ్రెస్ నందు కాపురము లేరని తిరిగి వచ్చినది. తేది **27-06-2024** నుండి విధులకు హాజరు కాకపోవుటచేతనూ, సదరు శ్రీ ఎం.వెంకటమోహన్‌ప్రసాద్ తండ్రి ఎం.చెంగల్రాయులును ఈ ప్రకటన వెలువడిన మూడు దినముల లోపల సంజాయిషీ ఇవ్వవలసినదిగా మరియు సత్వరము విధులకు హాజరు కావలసినదిగా ఆదేశించడమైనది.

పై ఆదేశములు ఉల్లంఘించిన ఎడల సదరు శ్రీ ఎం.వెంకటమోహన్‌ప్రసాద్ తండ్రి ఎం.చెంగల్రాయులును తదుపరి సమాచారము ఇవ్వకనే విధుల నుండి బహిష్కరింబడునని తెలియపరచడమైనది.

**NARAPUREDDY MOURYA, I.A.S**
Commissioner